సాక్షి
నిజామాబాద్
బుధవారం, 8, అక్టోబర్, 2025



ఘనంగా వాల్మీకి జయంతి

రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించారు.

- 8లో ▸



ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ఏదీ?

గ్రామాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేందుకు ఏర్పాటు చేసిన కేంద్రాలు అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో కనుమరుగయ్యాయి.

- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
32.9 /20.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమవుతుంది. చల్లనిగాలులు వీస్తాయి. అక్కడక్కడ ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

లైసెన్స్‌డ్ గన్‌లు అప్పగించాలి

- సీపీ పోతరాజు సాయిచైతన్య వెల్లడి



ఖలీల్‌వాడి: స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ వెలువడిన నేపథ్యంలో నిజామాబాద్ కమిషనరేట్‌లో తుపాకీ లైసెన్స్ పొందిన వారు తమ ఆయుధాలను పోలీస్‌స్టేషన్‌లో అప్పగించాలని సీపీ పోతరాజు సాయిచైతన్య ఒక ప్రకటనలో కోరారు. నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో లైసెన్స్ పొందిన వారు సెక్షన్ 21 ఆఫ్ ఆర్మ్ యాక్టు 1959 ప్రకారం ఈ నెల 9లోపు ఆయుధాలు జమ చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఉత్తర్వుల నుంచి మినహాయింపు కోసం కమిషనరేట్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొనసాగుతున్న నీటి విడుదల



నిజాంసాగర్(జుక్కల్) : ఎగువ ప్రాంతాల నుంచి 31,482 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో నిజాంసాగర్ ప్రాజెక్ట్ ఐదు గేట్ల ద్వారా 31,482 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1405 అడుగులు(17.8 టీఎంసీల) కాగా 1404.94 అడుగుల(17.715టీఎంసీల) నీరు నిల్వ ఉందని అధికారులు మంగళవారం తెలిపారు.

నేడు స.హ చట్టంపై సమావేశం


నిజామాబాద్ అర్బన్: సమాచార హక్కు చట్టం నిర్వహణపై బుధవారం నగరంలోని కలెక్టరేట్‌లో సమావేశం జరుగనుంది. సమావేశానికి రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ హాజరుకానున్నారు. మంగళవారమే ఈ సమావేశం జరగాల్సి ఉండగా అనివార్యకారణాలతో వాయిదా పడింది.

దరఖాస్తుల స్వీకరణ స్థలం మార్పు

ఖలీల్‌వాడి: ఆర్మూర్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాల దరఖాస్తులను సుభాష్‌నగర్‌లోని నిజామాబాద్ ఎక్సైజ్ ఆఫీస్‌లో తీసుకుంటున్నట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ మల్లారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం నుంచి ఈ నెల 18 సాయంత్రం 5 గంటల వరకు నిజామాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని ఏ-4, ఆర్మూర్ స్టేషన్ పరిధిలోని ఏ-4 దుకాణాల దరఖాస్తులను కార్యాలయంలో స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. బోధన్, భీంగల్, మోర్తాడ్ స్టేషన్ పరిధిలోని మద్యం దుకాణాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ యథావిధిగా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో కొనసాగుతుందన్నారు. వివరాలకు నిజామాబాద్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌వో 87126 58973 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

అంబేడ్కర్ వర్సిటీలో 10 వరకు ప్రవేశాలు

నిజామాబాద్‌అర్బన్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీ, పీజీలో ప్రవేశాలకు ఈ నెల 10 వరకు అవకాశం ఉందని కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో బీఏ, బీకాం, బీఎస్సీ, పీజీలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఎంబీఏ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఎస్సీలో గణితంతోపాటు ఈ సంవత్సరం నుంచి బాటని, ఫిజిక్స్, కెమిస్ట్రీ, జువాలజీ సబ్జెక్టులకు అవకాశం ఉందని తెలిపారు. ఐసెట్లో అర్హత పొందిన విద్యార్థులు ఎంబీఏలో ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. బీఎల్ఐసీ కోర్సును సైతం అందుబాటులోకి తెచ్చామన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని సంబంధిత ధ్రువపత్రాలతో సెంటర్‌లో సంప్రదించాలన్నారు.



ఈసారైనా ఎర్రజొన్న రైతు లాభపడేనా!

- ప్రతి ఏటా బైబ్యాక్ ఒప్పందాల ఉల్లంఘన
- పంటను తక్కువ ధరకే కొనుగోలు చేస్తున్న విత్తన వ్యాపారులు
- అధిక వర్షాలతో దిగుబడులు పెరిగాయని, ఆశించిన రేటు రాదని గ్రామాల్లో ఏజెంట్ల ప్రచారం

ఆర్మూర్ : జిల్లాలో ఎర్రజొన్న విత్తన వ్యాపారంపై ప్రభుత్వ నియంత్రణ లేకపోవడంతో గిట్టుబాటు ధర విషయంలో ప్రతి ఏటా రైతులు వ్యాపారుల చేతుల్లో నష్టపోతూనే ఉన్నారు. వ్యవసాయ అధికారులు విత్తన వ్యాపారులతో సమావేశాలు నిర్వహించి బై బ్యాక్ ఒప్పందం చేసుకొని రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని సూచిస్తారు. అయితే ఎలాంటి చట్ట బద్ధత లేకపోవడంతో కొనుగోలు సమయంలో వ్యాపారులు బై బ్యాక్ ఒప్పందాలను బుట్టదాఖలు చేస్తున్నారు. అతి తక్కువ ధరకు పంటను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. ఇది ఆనవాయితీగా మారింది. ఇదే విధంగా గతేడాది మోర్తాడ్‌లో క్వింటాలుకు రూ.3,800 పలికిన ధర చివరికి వచ్చే సరికి ఆర్మూర్ మండలం మిర్దాపల్లిలో రూ.3,300లకు కొనుగోలు చేసారు.

- ఈ ఏడాది సైతం రైతులు విత్తన వ్యాపారుల కుట్రకు నష్ట పోనున్నారు. త్వరలోనే అధికారులు బై బ్యాక్ ఒప్పందంపై వ్యాపారులు, రైతులతో అవగాహన సమావేశం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. కాగా కొందరు రైతులు ఇప్పటికే విత్తన వ్యాపారులతో బైబ్యాక్ ఒప్పందం చేసుకున్నారు.
- ఈ ఏడాది తాజాగా ఇటీవల జక్రాన్‌పల్లి మండలం మునిపల్లిలో క్వింటాలు ఎర్రజొన్నకు రూ.3,400 ధర ఇచ్చేందుకు రైతుతో విత్తన వ్యాపారి బై బ్యాక్ ఒప్పందాన్ని చేసుకున్నాడు.

అదేవిధంగా మోర్తాడ్ మండల కేంద్రంలోని రైతులతో తెల్లజొన్న క్వింటాలుకు రూ.3,900 ధర చెల్లిస్తానంటూ పదిహేను రోజుల క్రితం వ్యాపారి బై బ్యాక్ ఒప్పందం చేసుకున్నారు. అయితే విత్తన వ్యాపారి విత్తనాన్ని సరఫరా చేయకుండా రైతుల ఫోన్‌లకు స్పందించడం లేదు. ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే కొనుగోళ్ల సమయానికి పరిస్థితి ఏంటని రైతులు వాపోతున్నారు. జిల్లాలోని రైతులంతా ఒక్కతాటిపై ఉండి ఒకే రేటుతో వ్యాపారులతో బై బ్యాక్ ఒప్పందం చేసుకుంటే ఆ ఒప్పందాన్ని అధికారులు ఖచ్చితంగా అమలు చేయిస్తే గాని ఈ సమస్య పరిష్కారం కాదని అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి.



ఆర్మూర్‌లోని ఓ విత్తన కంపెనీలో ఎర్రజొన్న విత్తనాల శుద్ధి

జిల్లాలో ఎర్రజొన్న వ్యాపారం...

జిల్లాలో నాలుగు దశాబ్దాలుగా ఎర్ర, తెల్లజొన్న విత్తనాలను రైతులు పండిస్తున్నారు. ఆర్మూర్ ప్రాంతంలోని అంకాపూర్‌తోపాటు చుట్టుపక్కల గ్రామాల్లో సుమారు 40పైగా విత్తన కంపెనీలు ఉన్నాయి. ఈ విత్తన వ్యాపారులు ప్రతిఏటా అక్టోబర్, నవంబర్ మాసాల్లో రైతులతో బై బ్యాక్ ఒప్పందం చేసుకొని ఎర్రజొన్నల ఫౌండేషన్ విత్తనం సరఫరా చేస్తుంటారు. పంట ఫిబ్రవరి మాసంలో చేతికి రాగానే ఫౌండేషన్ విత్తనం ఇచ్చిన వ్యాపారే తిరిగి రైతుల నుంచి కొనుగోలు చేస్తాడు. ఆ విత్తనాలను శుద్ధిచేసి, ప్యాకింగ్ చేసి ఉత్తర భారతదేశంతోపాటు పాకిస్తాన్, బంగ్లాదేశ్, సౌత్ ఆఫ్రికా తదితర దేశాల్లో అధిక ధరకు అమ్ముతుంటారు. ఈ విత్తనాలతో ఉత్తర భారతదేశంలో పశువుల దాణా కోసం ఉపయోగించే గడ్డిని పెంచుతుంటారు. అయితే దేశం మొత్తంలో తెలంగాణ రాష్ట్రంలో అందులో జిల్లాలోని భూములు మాత్రమే ఎర్రజొన్న విత్తనాల సాగుకు అనువుగా ఉన్నాయి. కర్ణాటకలోని బళ్లారి ప్రాంతంలో 10 శాతం ఎర్రజొన్న విత్తనాలు పండించగా నిజామాబాద్ జిల్లాతోపాటు కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల్లో కలిపి మిగిలిన 90 శాతం పండిస్తారు. జిల్లాలోనే సుమారు 30 వేల ఎకరాలకు పైగా ఎర్రజొన్న పంటను సాగు చేస్తారు. అయితే విత్తన వ్యాపారులు సిండికేట్‌గా మారి రైతుల నుంచి తక్కువ ధరకు పంటను కొనుగోలు చేస్తున్నారు.

కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం నిర్వహిస్తాం

ఎర్రజొన్నల బైబ్యాక్ ఒప్పందాల విషయంలో కలెక్టర్ సూచనల మేరకు త్వరలో విత్తన వ్యాపారులతో సమావేశాలు నిర్వహిస్తాం. కమర్షియల్ క్రాప్ కావడం, ఎంఎస్‌పీ పరిధిలో లేకపోవడంతో ప్రభుత్వం గిట్టుబాటు ధర నిర్ణయించడం లేదు. దీనిని ఆసరాగా చేసుకొని వ్యాపారస్తులు ఒప్పందాలను ఉల్లంఘిస్తున్నారు. రైతులు ఐకమత్యంగా పంటను విక్రయిస్తే వ్యాపారస్తుల మోసాన్ని నియంత్రించవచ్చు.

– హరికృష్ణ, ఏవో, ఆర్మూర్

ఎత్తుగడకు తెరలేపిన వ్యాపారులు

రైతులు అనుసరిస్తున్న పంట మార్పిడి విధానంతో జిల్లాలోని అధిక మొత్తంలో రైతులు యాసంగిలో ఎర్రజొన్న పంటను విత్తుతుంటారు. విత్తన వ్యాపారులు తమ ఏజెంట్ల ద్వారా ఇప్పటికే గ్రామాల్లో ఈ ఏడాది అధిక వర్షాలతో పంట విస్తీర్ణం పెరిగి దిగుబడి గణనీయంగా వచ్చిందని, అందువల్ల రైతులు ఆశించిన ధర రాదంటూ ప్రచారం ప్రారంభించారు. రైతులు విత్తన వ్యాపారులు సూచించిన అతి తక్కువ ధరకే పంటను అమ్ముకొనే విధంగా ఒప్పందం చేసుకోవాలంటూ ప్రచారం కొనసాగిస్తున్నారు. ఈ ఎత్తుగడలో విత్తన వ్యాపారులు విజయం సాధిస్తే రైతులు రూ.కోట్లలో నష్టపోయే పరిస్థితి నెలకొంది.

నరాలు తెగే ఉత్కంఠ !

- బీసీ రిజర్వేషన్లపై నేడు హైకోర్టులో వాదనలు
- తీర్పు ఆధారంగానే ఎన్నికలపై ముందుకు వెళ్లనున్న ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికలు జరుగుతాయా లేదా అన్న దానిపై ఆశావహుల్లో నరాలు తెగే ఉత్కంఠ నెలకొంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం బీసీలకు 42 శాతం అమలు చేస్తూ ఎన్నికలకు రిజర్వేషన్లు ప్రకటించిన విషయం తెలిసిందే. దీన్ని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఈనెల 8వ తేదీకి వాయిదా వేసింది. కోర్టు తీర్పు ఆధారంగానే ప్రభుత్వం ఎన్నికలపై ముందుకు వెళ్లే అవకాశముందని రాజకీయ వర్గాలు పేర్కొంటున్నాయి.

జిల్లాలో 545 గ్రామ పంచాయతీలు, 5022 వార్డు స్థానాలు, 307 ఎంపీటీసీ స్థానాలు, 31 జెడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. రాష్ట్ర ఎన్నికల సంఘం గ్రామ పంచాయతీలు, స్థానిక సంస్థలకు గత నెల 27న షెడ్యూల్ ప్రకటించింది. ఈనెల 9 నుంచి ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లను స్వీకరిస్తామని, రెండు విడతల్లో ఎన్నికలు ఉంటాయని పేర్కొంది. అదేవిధంగా గ్రామపంచాయతీ ఎన్నికలు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం చివరి రెండు విడతల్లో ఎన్నికలు నిర్వహిస్తామని ప్రకటించింది.

కలిసొచ్చిన నేతల హడావుడి..

గ్రామాల్లో రిజర్వేషన్లు కలిసొచ్చిన నేతలు ప్రజలను కలుస్తూ మమేకమవుతున్నారు. కుల పెద్దలు, గ్రామ పెద్దలకు విందులు ఇస్తూ మచ్చిక చేసుకుంటున్నారు. కులసంఘాలు, యువజన సంఘాలను ప్రలోభాలకు గురి చేసే పనిలో నిమగ్నమయ్యారు. రిజర్వేషన్లు కలిసి రాని నాయకులు మాత్రం ఎట్టి పరిస్థితుల్లో రిజర్వేషన్లు మారుతాయనే ధీమాతో ఉన్నారు. హైకోర్టు తీర్పు తమకు అనుకూలంగా వస్తుందనే ఆశతో ఉన్నారు. కోర్టు తీర్పుపై నాయకుల భవితవ్యం ఆధారపడి ఉంటుంది.

ఎదురుచూస్తున్న ఆశావహులు

రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించినప్పటికీ.. గ్రామాల్లో ఎన్నికల వాతావరణం కన్పించడం లేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించిన వెంటనే.. దీన్ని సవాల్ చేస్తూ కొందరు హైకోర్టును ఆశ్రయించారు. 8వ తేదీవరకూ వేచి ఉండాలని కోర్టు ప్రభుత్వానికి సూచించింది. అంతలోనే మరికొందరు సుప్రీం కోర్టును ఆశ్రయించగా, పిటీషన్‌ను తిరస్కరించింది. బుధవారం హైకోర్టు ఏం తీర్పు ఇస్తుందోనని ఆశావహులు, ఆయా పార్టీల నేతల్లో ఉత్కంఠ నెలకొంది. ఎన్నికలు ముగిసిన తర్వాత ఫలితాల కోసం ఎదురు చూస్తున్నట్లుగా కోర్టు తీర్పు ఏమిస్తుందోనని ఉద్విగ్నంగా గడుపుతున్నారు. ప్రజలు సైతం ఎన్నికలు ఉంటాయో.. లేవోనని చర్చించుకుంటున్నారు.

సమన్వయంతో వివాదాన్ని పరిష్కరించాలి

- కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి
- సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పరిశీలన

వర్ని: సిద్దాపూర్ రిజర్వాయర్ వద్ద స్లూయిస్‌ల నిర్మాణానికి అవసరమైన స్థలం విషయంలో రెవెన్యూ, అటవీ శాఖ అధికారుల మధ్య నెలకొన్న వివాదాన్ని పరస్పర సమన్వయంతో పరిష్కరించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. మంగళవారం సిద్దాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులను, వివాదాస్పద స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. టోపో షీట్, గూగుల్ మ్యాప్‌ల ఆధారంగా స్థల నిర్ధారణ కోసం రెవెన్యూ, అటవీ శాఖ రికార్డులను ఆయన పరిశీలించారు. సాధ్యమైనంత త్వరగా వివాదాన్ని పరిష్కరించి ప్రాజెక్టు పనులు పూర్తయ్యేందుకు అధికారులు చొరవచూపాలన్నారు. ఈ విషయంలో జాప్యానికి తావివ్వొద్దన్నారు. స్లూయిస్‌ల నిర్మాణానికి అటవీ భూమి అవసరమైన పక్షంలో భూసేకరణ అనుమతుల కోసం ప్రభుత్వానికి నివేదిక పంపుతామని స్పష్టం చేశారు. అప్పటిలోగా రిజర్వాయర్‌కు సంబంధించిన ఇతర పనులను వేగవంతంగా చేపట్టాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట్ జిల్లా అటవీశాఖ అధికారి వికాస్ మీనా, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, ఇరిగేషన్ ఎస్‌డీవో సుధాకర్, తహసీల్దార్ సాయిలు తదితరులు ఉన్నారు.



సిద్దాపూర్ రిజర్వాయర్ వద్ద మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

జలం.. పుష్కలం!

- సెప్టెంబర్‌లో 2.45 మీటర్లు పెరిగిన భూగర్భ జలాలు
- ప్రస్తుతం జిల్లాలో సరాసరి నీటి మట్టం 6.03 మీటర్లు
- భారీవర్షాలతో భూమి పొరల్లోకి అసాధారణంగా చేరిన నీరు



డొంకేశ్వర్(ఆర్మూర్): జిల్లాలో ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు అసాధారణంగా పెరిగాయి. ఆగస్టు వరకు 8.48 మీటర్ల లోతులో ఉన్న నీటి మట్టాలు సెప్టెంబర్ ముగిసే నాటికి సరాసరి 6.03 మీటర్లకు వచ్చాయి. ఒక్క నెలలోనే ఏకంగా 2.45 మీటర్ల వరకు పెరిగాయి. గతేడాది సెప్టెంబర్ (7.20 మీటర్లు)తో పోలిస్తే మెరుగైన పరిస్థితి. వర్షాకాలంలో ఇప్పటి వరకు 104 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదుకాగా, ఇందులో 70 శాతం వర్షాలు ఆగస్టు, సెప్టెంబర్‌లోనే కురిశాయి. వరదలు పోటెత్తి భూగర్భంలో ఊట భారీగా చేరింది. దీంతో జిల్లా అంతటా భూగర్భ జలాలు ఒక్కసారిగా పైకి వచ్చాయి. ఈ ఏడాది మే నెల నుంచి సెప్టెంబర్ ముగిసే సరికి మొత్తంగా 6 మీటర్ల మేర పెరిగాయి. ఇది ఆరోగ్యకరమైన నీటి మట్టం కావడంతో వచ్చే ఏడాది వరకు బోరుబావులు, పంటలకు, సాగునీటికి ఎలాంటి ఢోకా ఉండదని గ్రౌండ్ వాటర్ డిపార్ట్‌మెంట్ అధికారి శ్రీనివాస్ బాబు 'సాక్షి'తో పేర్కొన్నారు.

నెలల వారీగా భూగర్భ జలాలు (మీటర్లలో)	
మే	12.48
జూన్	11.49
జూలై	11.76
ఆగస్టు	8.48
సెప్టెంబర్	6.03

85 శాతం విస్తరించిన భూగర్భ జలాలు

సెప్టెంబర్ మాసానికి సంబంధించిన భూగర్భ జలాల లెక్కలను ఇటీవల గ్రౌండ్‌వాటర్ డిపార్ట్‌మెంట్ తీసింది. జిల్లా వ్యాప్తంగా 82 ఫీజో మీటర్ల ద్వారా నీటి లెక్కలను సేకరించింది. ఇందులో 69 ఫీజో మీటర్లలో 10 మీటర్లలోపు నీటి మట్టాలున్నాయి. అలాగే 11 ఫీజో మీటర్లలో 10-20 మీటర్ల లోపు భూగర్భ జలాలున్నాయి. అదే విధంగా రెండు ఫీజో మీటర్లలో 20 మీటర్ల లోతులో ఉన్నాయి. అంటే, జిల్లా వ్యాప్తంగా 85 శాతం వరకు భూగర్భ జలాలు పుష్కలంగా విస్తరించి ఉన్నాయి.

ఆర్టీసీకి దసరా బొనాంజ

- రూ.19.53 కోట్ల ఆదాయం
- రెండో స్థానంలో నిజామాబాద్ రీజియన్

డిపో	టార్గెట్ (రూ.లక్షలు)	సాధన (రూ.లక్షలు)
ఆర్మూర్	13.98	17.30
బోధన్	21.23	22.25
నిజామాబాద్-1	21.10	24.26
నిజామాబాద్-2	29.25	24.61
బాన్సువాడ	11.59	12.55
కామారెడ్డి	19.86	18.13
మొత్తం	117.01	119.10



సిబ్బందిని అభినందిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న

ఖలీల్‌వాడి: ఆర్టీసీకి దసరా పండుగ సందర్భంగా లక్ష్యానికి మించి ఆదాయం వచ్చినట్లు నిజామాబాద్ రీజినల్ మేనేజర్ జ్యోత్స్న వెల్లడించారు. రీజియన్ పరిధిలో సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు ఆర్టీసీ బస్సులను వివిధ ప్రాంతాలకు నడిపింది. షెడ్యూల్ సర్వీస్‌కి అదనంగా 566 ప్రత్యేక బస్సులను నడపగా, ఆదాయ పరంగా రాష్ట్రంలోనే నిజామాబాద్ రీజియన్ రెండో స్థానం సాధించింది. రూ.18 కోట్లు టార్గెట్‌గా నిర్ణయించగా రూ.19.53 కోట్ల రాబడి వచ్చింది. నిజామాబాద్ ప్రాంతానికి రూ.1.17 కోట్లు లక్ష్యం విధించగా, రూ.1.19 కోట్లు ఆదాయం సమకూరింది. ఈ సందర్భంగా మంగళవారం డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బందిని ఆర్ఎం అభినందించారు.

లక్ష్యం దిశగా విద్యుదుత్పత్తి

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ దిగువన గల జల విద్యుదుత్పత్తి కేంద్రంలో విద్యుదుత్పత్తి లక్ష్యం దిశగా సాగుతుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 60 మిలియన్ యూనిట్ల లక్ష్యంగా జలసౌధ విధించగా, ఇప్పటి వరకు 47 మిలియన్ యూనిట్ల ఉత్పత్తి జరిగింది. ప్రస్తుతం ఎస్కేప్ గేట్ల ద్వారా నీటిని గోదావరిలోకి మళ్లిస్తు నిరంతరం విద్యుదుత్పత్తిని చేపడుతున్నారు.

సామర్థ్యానికి మించి..

జల విద్యుదుత్పత్తి కేంద్రంలో నాలుగు టర్బాయిన్‌లు ఉన్నాయి. ఒక్కో టర్బాయిన్ ద్వారా 9 మెగావాట్ల చొప్పున 36 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేపట్టే సామర్థ్యం ఉంది. కానీ ప్రస్తుతం సామర్థ్యానికి మించి 36.10 మెగావాట్ల విద్యుదుత్పత్తి సాగుతోంది. ప్రాజెక్ట్ నీటిమట్టం నిండుకుండలా ఉండటం, నీరు వేగంగా రావడంతో సామర్థ్యానికి మించి విద్యుదుత్పత్తి సాధ్యమవుతుందని జెన్‌కో అధికారులు తెలిపారు. ప్రస్తుత నెలలో ఇప్పటి వరకు 4.6 మిలియన్ యూనిట్లు జరిగింది. రోజుకు 0.87 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతోంది.

బస్సును అడ్డుకున్న విద్యార్థులు



కందకుర్తిలో బస్సు ఎదుట నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

రెంజల్(బోధన్): నిర్ణీత సమయానికి బస్సులు రాక పాఠశాలకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని రెంజల్ మండలంలోని కందకుర్తి గ్రామ విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజూ మాదిరిగానే మంగళవారం సైతం నిజామాబాద్ డిపోకు చెందిన బస్సు ఆలస్యంగా రావడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. బస్సు ఎదుట నిలబడి ధర్నా నిర్వహించగా, వారికి స్థానికులు మద్దతు తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్, కండక్టర్లతో వాదనకు దిగారు. సమయానికి బస్సు రాకపోవడంతో కందకుర్తి నుంచి రెంజల్ ఆదర్శ పాఠశాలతోపాటు వీరన్నగుట్ట, రెంజల్ హైస్కూల్ గ్రామాలకు వెళ్లే విద్యార్థులు తరగతులకు ఆలస్యంగా చేరుకుంటున్నారని పేర్కొన్నారు. అధికారులు వచ్చి సమస్యను పరిష్కరించే వరకు బస్సును కదలనిచ్చేది లేదని పట్టుబట్టారు. దీంతో కండక్టర్, డ్రైవర్లు మేనేజర్‌తో ఫోన్‌లో మాట్లాడించారు. విద్యార్థులకు ఇబ్బంది కలుగకుండా చూస్తామని మేనేజర్ చెప్పడంతో ఆందోళన విరమించారు.

నగరంలో అర్ధరాత్రి సీపీ తనిఖీలు



బస్టాండ్‌లో తనిఖీ చేస్తున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: నగరంలోని రైల్వేస్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, గాంధీచౌక్, నెహ్రూ పార్క్, శివాజీనగర్, కంఠేశ్వర్, దేవీ రోడ్, ఫ్లై ఓవర్ బ్రిడ్జి తదితర ప్రాంతాలలో సోమవారం అర్ధరాత్రి సీపీ సాయిచైతన్య ఆకస్మిక తనిఖీలు చేశారు. సీపీ మాట్లాడుతూ నగరంలో ఎలాంటి నేరాలు జరగకుండా ముందస్తు చర్యలలో భాగంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చి రైల్వేస్టేషన్, బస్టాండ్ పరిసరాల్లో ఉంటూ ఎలాంటి కారణం లేకుండా బయట తిరుగుతున్న వారిని విచారించామన్నారు. రాత్రివేళల్లో రోడ్లపై తిరుగుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మళ్లీ రాత్రివేళలో తిరిగితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజల రక్షణ కోసం పోలీసు శాఖ నిరంతరం పాటుపడుతోందని, పోలీసు సిబ్బందికి ప్రజలు సహకరించాలని సీపీ కోరారు.

క్లుప్తంగా

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



రాజంపేట: ప్రతి మహిళ తన ఆరోగ్యంపై శ్రద్ధ వహించి కుటుంబాన్ని ఆరోగ్యవంతమైన కుటుంబంగా తయారు చేయాలని మండల వైద్యాధికారి విజయ మహాలక్ష్మి సూచించారు. మంగళవారం పీహెచ్‌సీ పరిధిలో ఆరోగ్య మహిళ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ విజయ మహాలక్ష్మి మాట్లాడారు. 45 మంది మహిళలకు పరీక్షలు, చికిత్స చేసినట్లు తెలిపారు. హెల్త్ సూపర్వైజర్ మొహమ్మద్ మంజూర్, గంగామణి, హెల్త్ ఎడ్యుకేటర్ ఛీమ్, స్టాఫ్ నర్స్ ఇందిర, ఫార్మాసిస్ట్ పద్మ, ల్యాబ్ టెక్నీషియన్ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో ఉచిత కంటివైద్య శిబిరం



బాన్సువాడ రూరల్: బీర్కూర్ మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ భవన్‌లో మంగళవారం లయన్స్‌క్లబ్ ఆఫ్ బీర్కూర్ ఆధ్వర్యంలో ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. 24 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందజేశారు. నలుగురిని బోధన్ లయన్స్ కంటి ఆస్పత్రికి రిఫర్ చేశారు. లయన్స్ సితాలే రమేష్, మేకల గాలయ్య, కొట్టూరి సంతోష్, మేకల విఠల్, రషీద్, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్‌కు మరమ్మతులు



మురికి నీటిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ (ఫైల్)

బిచ్కుంద(జుక్కల్): మండల కేంద్రంలో మున్సిపల్ కార్యాలయం వెనక మురికి కాలువ పక్కన ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు మంగళవారం విద్యుత్ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ప్రవహిస్తున్న మురికి నీటిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మునుగుతోందని అధికారుల దృష్టికి స్థానికులు తీసుకెళ్లడంతో మరమ్మతులు చేపట్టారు. ప్రమాదం జరగకుండా ఎత్తు పెంచామని, మురికి నిలువ ఉండకుండా మురికి కాలువ కట్టించి చుట్టూ మొరం వేయాలని మున్సిపల్ అధికారులను విద్యుత్ అధికారులు కోరారు.



ట్రాన్స్‌ఫార్మర్ ఎత్తు పెంచుతున్న సిబ్బంది

ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ ఏదీ?

- గతంలో ప్రతి జీపీ పరిధిలో కలెక్షన్ యూనిట్ల ఏర్పాటు
- అధికారుల నిర్లక్ష్యంతో కనుమరుగైన వైనం



స్వచ్ఛ భారత్ మిషన్ కింద గతంలో ఏర్పాటు చేసిన ప్లాస్టిక్ సేకరణ కేంద్రం (ఫైల్)

మోర్తాడ్(బాల్కొండ): పర్యావరణ పరిరక్షణ కోసం గ్రామాల్లోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించేందుకు గతంలో ప్రతి జీపీ పరిధిలో సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేశారు. కానీ అధికారులు, పాలకుల నిర్లక్ష్యం కారణంగా ప్రస్తుతం కనుమరుగయ్యాయి. దీంతో ప్లాస్టిక్ వ్యర్థాలు ఇతర చెత్తతోపాటు కలిసిపోతుండటంతో పర్యావరణానికి ముప్పు పొంచి ఉంటుందని పర్యావరణ వేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

రీసైక్లింగ్ కోసం..

ఎన్నో రకాల ప్లాస్టిక్ సామగ్రిని, వ్యర్థాలను పడవేసే బదులు రీసైక్లింగ్ చేసి ప్రజలకు అవసరమైన సామగ్రిని తయారు చేయాలని గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చలేదు. ప్లాస్టిక్ కవర్లు, డబ్బాలు, ఇతర సామగ్రిని సేకరించి అందులో రీసైక్లింగ్‌కు అవసరమైన సామగ్రిని ఆ సెంటర్లకు పంపించాలని స్వచ్ఛ భారత్ మిషన్ కింద నిర్ణయం తీసుకున్నారు.ఇందుకోసం 2019లో మన ఊరు(పట్టణం)–మన ప్రణాళిక కార్యక్రమంను అప్పటి ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించింది. కార్యక్రమంలో భాగంగానే రీ–సైక్లింగ్‌కు అవకాశం ఉన్న ప్లాస్టిక్ సామగ్రిని పంచాయతీలలో సేకరించడానికి ప్రత్యేక యూనిట్‌లను ఏర్పాటు చేశారు. ప్రతి గ్రామంలో సేకరించిన ప్లాస్టిక్ సామగ్రిని వారం, పది రోజులకు ఒకసారి జిల్లాకేంద్రానికి తరలించి అక్కడి నుంచి రీసైక్లింగ్ సెంటర్‌లకు చేరవేయాలని నిర్ణయించారు. ఆరంభంలో కొన్ని రోజుల పాటు ప్లాస్టిక్ సామగ్రి సేకరణ కొనసాగింది. మళ్లీ ఈ కార్యక్రమం ముందుకు సాగలేదు. దీంతో అనేక పంచాయతీలలో ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు మరుగునపడిపోయాయి. సేకరించిన ప్లాస్టిక్ సామగ్రిని తరలించడానికి దారులు మూసుకపోవడంతో మంచి కార్యక్రమానికి మంగళం పలికినట్లు అయ్యింది.

ప్రభుత్వం దృష్టిసారిస్తేనే..

ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు కనుమరుగైన తర్వాత చెత్తలోనే ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రజలు విడదిపెడుతున్నారు. ఫలితంగా మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డంపింగ్ యార్డులలో కార్మికులకు రెండింతల పని భారం పెరిగింది. తడి చెత్తను వేరుగా, పొడి చెత్తను వేరు చేయడంతో పాటు ప్లాస్టిక్ వ్యర్థాలను గుర్తించి వాటిని రీసైక్లింగ్ కోసం ఉంచుతున్నారు. గతంలో ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలను ప్రత్యేకంగా నిర్వహించడం వల్ల పారిశుద్ధ్య కార్మికులకు పని భారం తప్పింది. ఇప్పుడు ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలను పునరుద్ధరిస్తే మేలు జరుగుతుందనే అభిప్రాయం వ్యక్తం అవుతుంది. ప్లాస్టిక్ వ్యర్థాలు వృథాగా పారవేయకుండా రీసైక్లింగ్ చేయడం వల్ల పర్యావరణం దెబ్బతినకుండా ఉంటుందని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్లాస్టిక్ వ్యర్థాలను రీసైక్లింగ్ చేసే అంశంపై దృష్టిసారించి పర్యావరణ పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కార్యక్రమాన్ని కొనసాగించాలి..



ప్లాస్టిక్ వ్యర్థాలను వృథాగా పారవేయడం వల్ల కాలుష్యం పెరుగుతుంది. అవసరమైన సామగ్రిని రీసైక్లింగ్ చేయడానికి అవకాశం ఉంది. ఈ కార్యక్రమంను ప్రభుత్వం కొనసాగించాలి. ప్లాస్టిక్ రీసైక్లింగ్ వల్ల మానవాళికి ఎంతో ఉపయోగం కలుగుతుంది.

– గంగాధర్ గౌడ్, తిమ్మాపూర్

ప్రభుత్వం పునరాలోచించాలి..



పర్యావరణానికి ముప్పును తగ్గించే ప్లాస్టిక్ రీసైక్లింగ్ కార్యక్రమాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించాలి. వెంటనే అధికారులు స్పందించి గతంలో మాదిరిగానే ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించాలి. ప్రజలు కూడా సహకరించి ప్లాస్టిక్ వేస్టేజీని సేకరణ కేంద్రాలకు చేరవేయాలి.

– అజారోద్దీన్, తిమ్మాపూర్

ప్రజల సహకారం అవసరం..

ప్లాస్టిక్ వ్యర్థాలను ప్రజలే వేరు చేసి చెత్తలో పారవేయాలి. ప్రజలు సహకరిస్తే ప్లాస్టిక్ వ్యర్థాలు చెత్తలో కలిసిపోకుండా ఉంటాయి. తడి చెత్త, పొడి చెత్త వేరు వేరుగా ఇవ్వడంతో పాటు ప్లాస్టిక్ సామగ్రిని వేరుగా ఇస్తేనే రీసైక్లింగ్‌కు పంపించడానికి వీలు ఉంటుంది. ప్రజలకు అవగాహన కల్పించడానికి కృషి చేస్తున్నాం.

– శ్రీధర్, ఎంపీవో, మోర్తాడ్

పంట దిగుబడులపై వరుణుడి ప్రతాపం

- తరచూ కురుస్తున్న వర్షాలకు తడుస్తున్న మక్క, సోయ పంటలు
- ఆరబెట్టడానికి తీవ్రంగా శ్రమిస్తున్న అన్నదాతలు



కొత్తపల్లిలో వర్షానికి తడిసిన మక్కలు

బాల్కొండ: ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటలపై వరుణుడు ప్రతాపం చూపడంతో అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాగు చేసిన పంట చేతికొచ్చిన సమయంలో వర్షాలు కురుస్తుండటంతో పంట దిగుబడులు తడిసిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈక్రమంలో పంటలను ఆరబెట్టడానికి అన్నదాతలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. మూడు రోజులుగా ఉదయం, సాయంత్రం, రాత్రి అంటూ తేడా లేకుండ వర్షం కురుస్తుండటంతో నూర్పిళ్లు చేసి రోడ్లపై ఆరబెట్టిన మక్కలు, సోయలు ఆరడం లేదు. కుప్పలు తీయడం , మళ్లీ కుప్పలు చేయడం కోసం రోజంతా రైతులు వారి రెక్కలను ముక్కలు చేసుకుంటున్నారు. దీనికి తోడు పంట దిగుబడులు ముక్కిపోతున్నాయి. సోయాలు కోత కోయకముందే మొక్కలపైనే మొలకెత్తుతున్నాయి. ఇంత కష్టం చేసినా చివరికి వ్యాపారుల చేతిలో మోసపోవాల్సి వస్తుంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా మక్కలకు, సోయాలకు ధర తగ్గించారు. తడిసిన మక్కలను మరింత తక్కువకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం స్పందించి మక్క, సోయ రైతులను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



బుస్సాపూర్‌లో మక్కలను ఆరబెడుతున్న రైతులు



రెంజర్లలో మక్క కంకుల కుప్ప నుంచి వర్షపు నీటిని తొలగిస్తున్న రైతు

రోజూ వాన పడుతోంది..



మక్కలు, సోయాలు ఆరబెడుతామంటే రోజూ వాన పడుతుంది. ఆరబెట్టుడు.. కుప్పలు చేసుడుకే రెక్కలు పోతున్నాయి. తడిసిన మక్కలు, సోయాలు అంటూ వ్యాపారులు ధరను తగ్గిస్తున్నారు. ఎంత కష్టం చేసిన ఫలం దక్కడం లేదు. ప్రభుత్వం ఆదుకోవాలి.

– చిల్కన్న, రైతు, బాల్కొండ

ఎస్సెస్సీ మెమోలో మార్పులు సాధ్యమేనా?

మీకు తెలుసా?



ప్రతి ఒక్కరికి ఎస్సెస్సీ సర్టిఫికెట్ (పదో తరగతి మార్కుల మెమో) చాలా ముఖ్యమైనది. చాలా సందర్భాలలో పుట్టిన తేదీ ధ్రువీకరణకు ఈ సర్టిఫికెటే ఆధారమవుతుంది. మరి ఇలాంటి మెమోలోనే పుట్టిన తేదీ తప్పుగా ముద్రితమైతే?.. మార్చుకునేందుకు కొన్ని అవకాశాలు ఉన్నాయి. ఎలా అంటే..

- ఎస్సెస్సీ ఫలితాలు విడుదలైన తర్వాత మూడేళ్ల లోపు మాత్రమే తప్పుగా ముద్రితమైన డేట్ ఆఫ్ బర్త్‌ను సరి చేసుకోవడానికి అవకాశం ఉంటుంది.
- మొదటగా పదో తరగతి పాస్ అయినా పాఠశాల హెచ్‌ఎం ధ్రువీకరణతో ఎంఈవో, అక్కడి నుంచి డీఈవో ద్వారా డీఎస్ఈకి దరఖాస్తు చేసుకోవాలి.
- స్కూల్ రిజిస్టర్లో నమోదైన తేదీకి భిన్నంగా టెన్త్ సర్టిఫికెట్లో తేదీ నమోదైతే అధికారులు ధ్రువీకరించి మారుస్తారు.
- డీఎస్ఈ ఆమోదం తెలిపితేనే ఎస్సెస్సీ బోర్డు అధికారులు తేదీని మార్చి కొత్త సర్టిఫికెట్‌ను అందజేస్తారు. దీనికి ఎలాంటి ఫీజు ఉండదు.
- విద్యార్థుల పేర్లు, వారి తల్లిదండ్రుల పేర్లలో తప్పులుంటే, ఇతర మైనర్ పొరపాట్లు ఉంటే బోర్డు అధికారులే సరి చేస్తారు.
- ఇంటి పేరు విద్యార్థి తల్లిదండ్రుల పేరు ఒక పేరుకు బదులుగా మరో పేరు ముద్రితమైతే హెచ్‌ఎం, ఎంఈవో డీఈవో ద్వారా పాఠశాల విద్యాశాఖ సంచాలకుని కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవాలి. వారు వివరాలను పరిశీలించి మార్పులు చేయాలని ఎస్సెస్సీ బోర్డుకు పంపిస్తారు.
- ఒరిజినల్ టెన్త్ సర్టిఫికెట్ పోతే మీ సేవ కేంద్రం ద్వారా స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి, పోలీసులు ఇచ్చే ధ్రువపత్రం తీసుకోవాలి.
- అలాగే గవర్నమెంట్ ఆఫ్ ట్రెజరీ పేరుమీద రూ. 250 చలానా తీయాలి.
- సర్టిఫికెట్ పోయిందని, ఒకవేళ దొరికితే దాన్ని బోర్డుకు అప్పగిస్తానని అభ్యర్థి ధ్రువీకరిస్తూ రూ.50 స్టాంప్ పేపర్‌పై నోటరీ అఫిడవిట్ తీసుకోవాలి.
- వివరాలన్నింటితో పాటు హెచ్‌ఎం ధ్రువీకరణతో ఎస్ఎస్‌సీ బోర్డుకు దరఖాస్తు చేసుకోవాలి.
- అన్ని వివరాలు సరిగా ఉంటే డూప్లికేట్ మెమోను అధికారులు జారీ చేస్తారు.

– రామారెడ్డి

కనుల పండువగా శ్రీవారి రథోత్సవం



శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి వారి రథాన్ని లాగుతున్న కమాండెంట్ సత్యనారాయణ, భక్తులు



రథోత్సవంలో కోలాటం ఆడుతున్న మహిళలు

డిచ్‌పల్లి: మండలంలోని ఏడో బెటాలియన్ పరిధిలోగల శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం స్వామివారికి రథోత్సవాన్ని కనులపండువగా నిర్వహించారు. స్వామి వారి రథాన్ని కమాండెంట్ సత్యనారాయణ, అడిషనల్ కమాండెంట్ సాంబశివ రావు స్వయంగా లాగారు. శ్రీ లక్ష్మీ వెంకటరమణ గోవిందా.. గోవిందా.. అంటూ భక్తుల నామస్మరణతో బెటాలియన్ మారుమోగింది. అంతకుముందు ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం క్షీరచంద్ర దర్శనం, హారతి, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ భూదానకర్త కుమారులు ప్రమోద్ జాజు, వినోద్ జాజు కుటుంబసభ్యులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. అసిస్టెంట్ కమాండెంట్లు కేపీశరత్‌కుమార్, కేపీ సత్యనారాయణ, ఆర్‌ఐలు, ఆర్ఎస్సైలు, బెటాలియన్ సిబ్బంది, వారి కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ప్రసవాలు చేసే వైద్యులేరీ?

- బాల్కొండ ప్రభుత్వాస్పత్రిలో గైనకాలజిస్ట్ కరువు
- ఇబ్బందులు పడుతున్న గర్భిణులు



బాల్కొండ ప్రభుత్వాస్పత్రి

బాల్కొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు నిలిచిపోయాయి. గత కొన్నాళ్లుగా పూర్తిస్థాయిలో వైద్య సిబ్బంది లేకున్నా గైనకాలజిస్ట్ ఉండటంతో ప్రతి మంగళ, శుక్రవారల్లో రెండు రోజులు ఆపరేషన్లు చేసి కాన్పులు చేశారు. ప్రస్తుతం ఆ గైనకాలజిస్టు సైతం బదిలీపై బోధన్ వెళ్లడంతో కాన్పులు నిలిచి పోయాయి. మరో వైద్యురాలు జనరల్ సర్జన్ బదిలీపై వచ్చారు. కానీ ఇక్కడ మూడు రోజులు, మరో ఆస్పత్రిలో మూడు రోజులు వైద్యసేవలను అందిస్తుంది. కనీసం నలుగురు వైద్యులు ఉండాల్సిన ఆస్పత్రిలో ప్రస్తుతం ఒక్క మెడికల్ ఆఫీసర్ మాత్రమే ఉన్నారు. దీంతో స్థానిక గర్భిణులు ప్రసవాల కోసం ఆర్మూర్ ప్రభుత్వాస్పత్రికి వెళ్లాల్సి వస్తోంది. కానీ జిల్లా సరిహద్దు ప్రాంతం నుంచి ఆర్మూర్ వెళ్లాలంటే కనీసం 50 కిలోమీటర్లు ప్రయాణం చేయాల్సి వస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీఎంహెచ్‌వో రాజశ్రీ ఇటీవల ఆస్పత్రిని తనిఖీ చేయగా, వైద్యులను నియమించి, ప్రసవాలు ప్రారంభిస్తామని తెలిపారు. కానీ ఇప్పటికీ ప్రారంభం కాలేదు. వైద్యుల కొరతపై సంబంధిత అధికారులను 'సాక్షి' ఫోన్‌లో సంప్రదించగా స్పందించలేదు. ఇప్పటికైనా పాలకులు, ఉన్నతాధికారులు స్పందించి ఆస్పత్రిలో వెంటనే గైనకాలజిస్ట్‌ను నియమించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

9న అండర్ 19 బాలికల ఫుట్‌బాల్ జట్టు ఎంపికలు

నిజామాబాద్ నాగారం: నగరంలో ఈనెల 9న అండర్ 19 బాలికల జిల్లా జట్టు ఎంపిక చేయడానికి పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యా అధికారి తిరుమలపుడి రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ పోటీలలో పాల్గొనేందుకు ఈ జట్టు ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయి టోర్నమెంట్ ఈనెల 11, 12, 13 తేదీలలో సంగారెడ్డిలో నిర్వహిస్తున్నారన్నారు. జిల్లా జట్టు తరపున పాల్గొనేందుకుగాను రాజారామ్ స్టేడియంలో గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించే పోటీలకు అండర్ 19 బాలికలు హాజరు కావాలన్నారు.

ఘనంగా మహర్షి వాల్మీకి జయంతి



కలెక్టరేట్‌లో వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి

నిజామాబాద్‌అర్బన్/ఖలీల్‌వాడి: రామాయణంను రచించిన మహర్షి వాల్మీకి జయంతిని మంగళవారం జిల్లాకేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో అధికారికంగా నిర్వహించిన జయంతి వేడుకల్లో కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి హాజరై, వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి, ప్రత్యేక పూజలు చేసి, నివాళులు అర్పించారు. అలాగే నగరంలోని సీపీ కార్యాలయంలో వాల్మీకి చిత్రపటానికి అదనపు డీసీపీ రామచంద్రరావు పూలమాలలు వేసి, పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. వాల్మీకి ఒక సామాన్య వ్యక్తిగా పుట్టి, సప్త ఋషుల బోధనల ద్వారా మహర్షి వాల్మీకిగా మారి అద్భుతమైన రామాయణం గ్రంథాన్ని అందించినట్లు తెలిపారు. వాల్మీకిని అందరూ స్మరించుకోవాలని తెలిపారు. సమాజ శ్రేయస్సుకు అవసరమైన జీవన సూత్రాలను, రామాయణం ద్వారా వాల్మీకి బోధించారని తెలియజేశారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి నర్సయ్య, సీపీ ఆఫీస్ సూపరింటెండెంట్‌లు శంకర్, బషీర్ అహ్మద్, రిజర్వు సీఐ శ్రీనివాస్, తిరుపతి, తదితరులు ఉన్నారు.



సీపీ కార్యాలయంలో..

క్రైం కార్నర్

కాలువలో పడి ఒకరి మృతి



కమ్మర్‌పల్లి: మండల కేంద్రం నుంచి నాగాపూర్ వెళ్లే రోడ్డులోని వరద కాలువలో ప్రమాదవశాత్తు ఓ వ్యక్తి పడి మృతి చెందిన ఘటన మంగళవారం వెలుగు చూసింది. స్థానిక ఎస్సై అనిల్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా.. కమ్మర్‌పల్లి గ్రామానికి చెందిన కొమిరే రాజేందర్(47) ఆదివారం సాయంత్రం నాగాపూర్ రోడ్డులోని వరద కాలువలో కాళ్లు కడుక్కునేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు పడి నీట మునిగాడు. అతడి ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు ఎంత ప్రయత్నించినా లభించలేదు. మంగళవారం ఉదయం కాలువలో వ్యక్తి మృతదేహం తేలియాడటంతో గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే వారు ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆర్మూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చికిత్సపొందుతూ ఒకరు..



మాక్లూర్: రైలు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఒడ్డెట్‌పల్లి గ్రామానికి చెందిన పుల్లింటి సాయిలు(54) సోమవారం తన మేకలను గ్రామ శివారులో మేపుతుండగా మధ్యాహ్నం సమయంలో ఓ మేక రైలు పట్టాలపైకి వెళ్లింది. ఆ సమయంలోనే రైలు వస్తుండటంతో సాయిలు గమనించి మేకను పట్టాల పైనుంచి తరమివేసే ప్రయత్నంలో అతడిని రైలు ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడి కాళ్లు, చేతులు విరిగిపోయాయి. గమనించిన సమీప రైతులు వెంటనే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతిచెందినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య సావిత్రి, కుమారుడు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండల కేంద్రానికి ఇసుక లోడ్‌తో వచ్చిన ట్రాక్టర్‌ను సోమవారం రాత్రి పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. బాన్సువాడ మండలం బుడ్మి గ్రామం నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తీసుకురావడంతో ట్రాక్టర్‌ను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

మలేషియాలో తప్పిపోయిన బోధన్‌వాసి

- ఆచూకీ కనుగొని, స్వదేశానికి రప్పించాలని కుటుంబీకుల వేడుకోలు
- ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందజేత



ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందిస్తున్న బోధన్‌కు చెందిన జ్యోతి, కుటుంబ సభ్యులు

బోధన్: ఉపాధి కోసం మలేషియా దేశం వెళ్లిన బోధన్ వాసి ఒకరు కొన్ని నెలల క్రితం తప్పిపోయారు. సదరు వ్యక్తి ఆచూకీ కనుగొని, స్వదేశానికి రప్పించాలని కుటుంబీకులు వేడుకుంటూ, ప్రవాసీ ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. కుటుంబసభ్యులు తెలిపిన వివరాలు ఇలా.. పట్టణంలోని రాకాసీపేట ప్రాంతానికి చెందిన ప్యాట విజయ్ కుమార్ (38) ఉపాధి నిమిత్తం మేలో మలేషియా (కౌలాలంపూర్)కు వెళ్లాడు. అక్కడ విధుల్లో చేరిన రెండు రోజులనంతరం మానసికంగా కుంగిపోయి అసహనంతో ప్రవర్తిస్తున్నట్లు కుటుంబసభ్యులకు సమాచారం వచ్చింది. దీంతో వెంటనే అతడిని తిరిగి తీసుకొచ్చేందుకు టిక్కెట్ కోసం ఏజెంట్‌కు రూ.30 వేలను కుటుంబీకులు పంపించారు. కానీ జూన్ 6 నుంచి అతడి జాడ తెలియకుండాపోయింది. ఈవిషయమై తెలంగాణ ఎన్నారై విభాగం నుంచి మలేషియాలోని ఇండియన్ హైకమిషన్‌కు సమాచారం ఇచ్చినట్లు కుటుంబీకులు తెలిపారు. ఈక్రమంలో తన భర్త ఆచూకీ వెతికి స్వదేశానికి రప్పించాలని కోరుతూ ఆయన భార్య జ్యోతి హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన ప్రవాసీ ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. అలాగే ఎంపీ ధర్మపురి అర్వింద్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులచారి, కలెక్టర్, బోధన్ పోలీసుల దృష్టికి తీసుకెళ్లినట్లు కుటుంబీకులు వెల్లడించారు.

గుడుంబా విక్రేతకు ఏడాది జైలుశిక్ష

కమ్మర్‌పల్లి: గుడుంబా విక్రయించిన కేసులో నిందితురాలికి ఆర్మూర్ ప్రథమ శ్రేణి న్యాయస్థానం ఏడాది జైలు శిక్షతోపాటు, రూ. 10వేలు జరిమాన విధించింది. పబ్లిక్ ప్రాసిక్యూటర్ రామకృష్ణ తెలిపిన వివరాలు ఇలా.. కమ్మర్‌పల్లి మండలం హాసకొత్తూర్ గ్రామానికి చెందిన పూజారి మౌనిక ఏడాదిన్నర క్రితం తన ఇంట్లో గుడుంబా విక్రయిస్తుండగా, ఎక్సైజ్ ఎస్సై మానస పట్టుకొని కేసు నమోదు చేశారు. కోర్టులో ఆమెను హాజరుపర్చగా, జడ్జి సాక్షులను విచారించి, నిందితురాలికి ఏడాది జైలు శిక్షతో పాటు, రూ. 10 వేలు జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు వెలువరించినట్లు తెలిపారు.

డ్రంకన్‌డ్రైవ్ కేసులో ఇద్దరికి..

దోమకొండ: మండలంలో ఇటీవల పోలీసులు డ్రంకన్‌డ్రైవ్ తనిఖీలు చేపట్టగా, లింగుపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి, పాల్వంచకు చెందిన ఓ వ్యక్తి మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. పోలీసులు వారిపై కేసు నమోదు చేసి మంగళవారం కామారెడ్డి మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపర్చారు. జడ్జి వారికి ఒకరోజు జైలు శిక్షతోపాటు రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి..

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ మండలం అంకాపూర్ గ్రామానికి చెందిన మాణిక్యాడ్ లాలేష్ ఇటీవల డయల్ 100కు కాల్ చేసి పదేపదే పోలీసులకు విసిగిస్తూ విధులకు ఆటంకం కలిగించాడు. దీంతో పోలీసులు అతడిపై న్యూసెన్స్ కేసు నమోదు చేసి, మంగళవారం ఆర్మూర్ కోర్టులో హాజరుపర్చారు. జడ్జి గట్టు గంగాధర్ విచారణ జరిపి, నిందితుడికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ తెలిపారు.

సేవలతోనే ప్రజల్లో గుర్తింపు



భిక్కనూరు: ప్రజలకు అందించే సేవలతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని సిద్ధరామేశ్వరాలయం పీఠాధిపతి సదాశివ మహంత్ శివాచార్య అన్నారు. మంగళవారం ఆయన మండల రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన కుంట లింగారెడ్డిని సన్మానించారు. ఈ సందర్భంగా శివాచార్య మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవగా భావించాలన్నారు. కులమతాలకు అతీతంగా సేవలు అందించాలన్నారు. రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు యాదిరెడ్డి, ఏనుగు తిమ్మారెడ్డి, గణేష్‌రెడ్డి, పడమటి రవి, నాగార్తి మల్లేష్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'70 ఏళ్లుగా ఎస్సీ రిజర్వేషన్ రాలేదు'



లింగంపేట(ఎల్లారెడ్డి): 70 ఏళ్లుగా శెట్పల్లి గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ రాలేదని.. తమ గ్రామానికి వచ్చే ఎన్నికల్లో సర్పంచ్ పదవిని ఎస్సీలకు రిజర్వ్ చేయాలని కోరుతూ మంగళవారం అదనపు కలెక్టర్ చందర్‌నాయక్‌కు గ్రామ అంబేడ్కర్ సంఘం సభ్యులు వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సుమారు 40 కుటుంబాలు ఉన్నా నేటికి రిజర్వేషన్ రాకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. నేతలు తోట సాయిలు, పరంధాములు, మన్నె చిన్న బాలయ్య, శంకర్, రాజయ్య, సాయిలు, రాములు, సాయికుమార్ పాల్గొన్నారు.